[1967వ సంవత్సరం దీపావళికి జాగృతి వారపత్రికవారు నిర్వహించిన చారిత్రక కథలపోటీలో ఈ కథ ఉత్తమ చారిత్రక కథగా బహుమతి నందుకున్నది.]

# కన్యాదానం

అంబరమంతా మేఘాచ్ఛాదితమైవుంది పెను తుఫాను వచ్చేలాగుంది వాతావరణం.

ఆలాంటి సమయంలో అంబర్ ప్రభువైన రాజా బిహారి మల్ అంతఃపురానికి వెళ్ళేడు.

రానున్న మహోపద్రవాన్ని ఎలా యెదుర్కొనడమా అని ఆలోచిస్తూ కూర్చున్నది రాకుమారి జియారాణి.

తండ్రి వచ్చి తలపై నిమురుతూ "జియా!" అని పిలిచే సరికి ఉలిక్కిపడి వెనుదిరిగి చూసింది.

ఆ సమయంలో తండ్రి తన దగ్గరికెందుకు వచ్చాడో ఆమెకు తెలుసు. అతడివంక యెంతో దీనంగా చూసింది జియారాణి.

"నీ కన్యాయం చేసేటంతటి నీచుణ్ణి కాదమ్మా నేను! అందరి క్షేమంకోరి, అన్నీ ఆలోచించే నేనీ అభిప్రాయానికి వచ్చేను." తనను తాను సంబాళించుకుంటూ అన్నాడు రాజా బిహారిమల్.

"అందరి క్షేమం అనే పేరుతో నయవంచకుడు, దురాక్రమణదారుడూ అయిన ఆ మ్లేచ్ఛుని వివాహమాడమని నాకు

నచ్చచెప్పడానికి మీకు నోరెలా వస్తోంది నాన్నా ?" గుండె బిగబట్టుకొని ధైర్యం తెచ్చుకొని అడిగింది జియారాణి.

"అక్బరు సామాన్యమైనవాడుకాదు. మహా వీరుడు. అనతికాలంలోనే యావత్ భారతదేశాన్ని తన పాదా।కాంతం చేసుకొని చక్రవర్తి పీఠాన్ని అధిష్టించగలిగే అదృష్ట యోగం గల మహానుభావుడు. అట్టి ఘనతరమైన వ్యక్తి నీ సోయగానికి దాసుడై కన్యాదానాన్ని అర్థించినప్పుడు కాదని ఎలాగనడం? వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకు. ఇంతకంటె శుభలక్షణ లక్షితుండైన యువకుడు నీకీ భారత దేశంలో యింకెక్కడా లభ్యమవడు !" జియారాణిలో ఆశలు రేకెత్తించేటందుకై అక్బరు యొక్క ఘనతను వర్ణించడానికి పూనుకొన్నాడు బిహారిమల్.

జియారాణి అదోలా నవ్వుతూ "అల్పమైన, నీచమైన ఆశలకు మీ యీకుమార్తె లోబడిపోతుందని భావిస్తున్నారా నాన్నా ?"

"లేదు; లేదు ! ... నా రక్తాన్ని పంచుకు పుట్టిన నా కుమార్తె గురించి నేనెన్నడూ అల్పంగా భావించలేను. నీవు ధీర గంభీర వనితవు ! ... సుక్షత్రియ వీరకాంతవు ! ... రాజ్య క్షేమంకోసం, శాంతికోసం, అక్బరునకు బందీలైయున్న మన బంధుమిత్రుల విముక్తికోసం నువ్వు త్యాగశీలవుకూడా కాగలవని ఆశిస్తున్నాను జియా !"

"వీర క్షత్రియ వంశంలో జన్మించిన మీరు ఈ రకంగా మాట్లాడడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. క్షాత్ర శక్తితో విడిపించదగిన బంధు మిత్రులను యిలా అక్బరునకు నన్ను అంటగట్టి విడుదల చేయిస్తామనడం శాంతి కాముకత అని పించుకోదు. ఇందుకు నేనంగీకరించడం త్యాగమని యెంత మాత్రం అనిపించుకోదు! ... మనం క్షత్రియులం! ... కేవలం పిరికితనంతో ... ..."

"ఇక చాలించు నీ ఉపన్యాసం. తండ్రికే నీతులు బోధించేటంతటి దానివయ్యావుటే నీవు? నన్ను ధిక్కరించి ..."

"క్షమించండి. మిమ్మల్ని ధిక్కరించాలనే సంకల్పము నాకు లేదు. మీ మాటను నేనింతవరకూ ఏనాడూ కాదన లేదు. కాని ఈ ఒక్క విషయంలోమాత్రం నాకు స్వేచ్ఛను యివ్వండి. నా అభిప్రాయాన్ని మన్నించండి!"

"అది సాధ్యంకాదు. నువ్వూ, నేను, అందరం ఈ రాజ్య క్షేమానికి తలొగ్గవలసినవాళ్ళమే! అక్బరు నిన్ను కోరేడు. ఇస్తానని మాట యిచ్చేను. ఇప్పుడునిరాకరిస్తే అందువల్ల వచ్చే విపత్తుకు, సంక్షోభానికి నేను కారకుణ్ణి కాదల్చుకోలేదు. నీ అభిరుచులకోసం శాంతికి భగ్నంవాటిల్లే విధంగా నేను ప్రవ ర్తించదల్చుకోలేదు." కాస్త కటువుగా అన్నాడు బిహారిమల్.

"శాంతికి భగ్నం వాటిల్లేది నా అభిరుచులవల్లకాదు! యీ రాజ్యానికి విపత్తు నావల్ల రాదు. దురదృష్టవశాత్తు మన

ఈ రాజ్యానికేదయినా విపత్తు సంభవిస్తే, అది మీవంటి స్వధర్మభ్రష్టులైన పరిపాలకులవల్లనే. మీ క్షాత్ర తేజస్సు నశించినందువల్లనే. మీరు ఆత్మ గౌరవము కోల్పోయినందువల్లనే. క్షాత్రధర్మాన్ని విస్మరించి పిరికిపందలైనందువల్లనే..."

వింటూ మరి సహించలేకపోయేరు బిహారీమల్. పళ్ళు పటపట కొరుకుతూ ఆమె సుకుమారమైన చెక్కిలిపై చెయ్యి ఆచి గట్టిగా ఒక లెంపకాయ కొట్టి "నోరు ముయ్యవే మూర్ఖురాలా! ... నువ్విప్పుడు యెవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని అడిగేరు.

"తెలుసు!... స్వధర్మ రక్షణాసక్తిలేని తండ్రితో మాట్లాడుతున్నానని తెలుసు. కాస్త కటువుగా మాట్లాడుతున్నందుకు క్షమించండి నాన్నా! ... మీరు నన్నేంచేసినా సరే! నేనీనాడు చెప్పదల్చుకున్న విషయాలను చెప్పితీరతాను. నన్ను దురాక్రమణదారుడయిన అక్బరుకిచ్చి వియ్యమొందినంతమాత్రాన మన యీ రాజ్యం శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లుతుందని, మీరొక ఆత్మగౌరవంగల స్వతంత్ర పరిపాలకునిగా పరిగణింపబడతారని, ఈ రాజ్యపు అస్తిత్వం నిలుస్తుందని మీరు భావిస్తున్నట్లయితే అంతకంటే పొరపాటు ఇంకేదీ వుండదు! ... శాంతి అనే పేరుతో మీరు ప్రదర్శిస్తున్న యీ క్షాత్రహీనత యీ దేశానికెంతో అరిష్టదాయకం! ... నన్ను బలిగొనడంతో అక్బరు సంతుష్టుడై ఊరుకుంటాడనుకోడం వట్టి భ్రమ. నన్ను రక్షించలేని మీరు ఈ రాజ్యాన్ని రక్షించ

గలమనుకోడంకూడా భ్రమే!" అని కొంచెంసేపు ఆగి రుద్ధ కంఠంతో "నాన్నా! ... మీ పాదాలను పట్టి వేడుతున్నాను! ఆ విధర్మీయుని బారినుండి, ఆ కామోద్రిక్తుని బారినుండి, ఆ రాజ్య విస్తరణ దురాశాపాతకుని బారినుండి నన్ను, యీ రాజ్యాన్ని, యీ ప్రజలను కాపాడండి నాన్నా!" అంటూ తండ్రి పాదాలపై మోకరిల్లింది.

పరిస్థితి శృతిమించుచున్నదని గుర్తించేడు బిహారీమల్. లాలనగా అన్నాడు "అక్బరు నీ వనుకున్నంతటి దుర్మార్గుడు కాడమ్మా! అతడు సహృదయుడని, రాజనీతి కోవిదుడని, పర మత సహనము కలవాడని, పరమ దయాళుడని ప్రజలు వేనోళ్ళ చెప్పుకుంటున్నారు. నీవు వినలేదా ?"

"అయితే మరి యీ బలవంతం దేనికినాన్నా? నా కిష్టం లేనప్పుడు ఆ దయాళుడు నన్నెందుకు వదలడు ? అత డంతటి సహృదయుడే అయితే మనపైకి యెందుకు దండెత్తి వచ్చేడు ? మనవారి నెందుకు చెరబట్టేడు ? వారిని విడుదల చెయ్యా లంటే నన్ను తనకు దానంచెయ్యాల్సిందేనని ఎందుకు షరతు పెట్టేడు ? పర మతములకు చెందిన స్త్రీలను పెండ్లాడడం పర మత సహనం కాజాలదు! ... అతని ఘనతను గురించి మన మీనాడు వింటున్న మాటలన్నీ అతి బలవత్తరమైన ప్రచా రంలోంచి ఉత్పన్నమైన అతిశయోక్తులు మాత్రమే! ఆ పర మత సహనాది ప్రవచనాలన్నీ అతగాడి కుటిల రాజనీతిలో

ఒక భాగంకాదని మీరు చెప్పగలరా?" అని కాస్త ఆవేశంతో అడిగింది జియారాణి.

తగిన సమాధానమివ్వలేకపోవడంచేత ఉక్రోషముతో మండిపడ్డాడు బిహారీమల్. పళ్ళు పట పట కొరుకుతూ, "మూర్ఖురాలా! నా విజ్ఞతనే సవాలు చేయుచున్నావటే? నీమాత్రం అవగాహనశక్తి నాకు లేదనా నీ ఉద్దేశ్యం?" అని అడిగేడు.

"నా ఉద్దేశ్యం అదికాదు నాన్నా! బాగా ఆలోచించమని ప్రార్థిస్తున్నాను అంతే!... అక్బరంత సహన స్వరూపుడే అయితే అవాంఛనీయమైన ఈ దుస్థితి మనకెందు కేర్పడుతుంది? ఇంతకీ అతడికి నామీదవున్న అధికారమేలాంటిదని అడుగుతున్నాను!... నన్నతని ఆధీనం చేసినట్లయితే తన ఆధీనంలో బంధీలైయున్న మన బంధు మిత్రాదులందరినీ విడుదలచేస్తానని ఏ న్యాయాన్ని అనుసరించి అతనంటున్నాడో తెలుసా? ఏం న్యాయంతో అతని మతానికి చెందిన అతని పూర్వీకులంతా లక్షలాది హిందూ స్త్రీలను బలవంతముగా చెరచేరో; ఏ న్యాయంతో హిందువులు పరమ పవిత్రంగా భావించే దేవాలయాలను, మహత్తర గ్రంథాలను నాశనం చేసేరో; ఏ న్యాయంతో ఎంతోమంది రాజపుత్రవీరులను కుటిల పద్ధతులతో సంహరించి వారి దివ్యమైన భవనాలను స్వాధీనము చేసుకొని అవన్నీ తామే స్వయంగానిర్మించినట్లు ప్రకటించుకుంటున్నారో ఆ దౌర్జన్యపూరితమైన న్యాయాన్ని అనుసరించే నన్నతనికి

సమర్పించమని మీపై గట్టి ఒత్తిడి తీసుకొస్తున్నాడు. ఆ దుర్మార్గుడి కత్తికి బలిగా ఎంతమంది నాశనమైనాసరే కంఠములో ప్రాణమున్నంత వరకూ తలయొగ్గవద్దునాన్నా!" సుక్షత్రియ వీర వనితలా స్నిగ్ధ కంఠంతో అంది జియారాణి.

మాటలలో పరాజితుడవుతున్నకొద్దీ బిహారిమల్ లో ఉడుకుమోత్తనం అధికమవసాగింది. "దౌర్భాగ్యురాలా! ... నీకున్నపాటి రాజనీతిజ్ఞత నాకులేదనుకోడం నీ అహంభావాన్ని సూచిస్తోంది! ... నేను తల్చుకుంటే! ..."

"కాళ్ళూచేతులూ విరచికట్టి ఆ కామోద్రేకి పాదాల దగ్గర నన్ను పడవేయగలరని నాకు తెలుసు! ... అందువల్ల మీ గౌరవముగాని, ఈ రాజ్య గౌరవముగాని నిలుస్తుందని భావించకండి! ఇది మన వంశ గౌరవ ప్రతిష్టలకు తీవ్రమైన కళంకాన్ని ఆపాదిస్తుంది. శాంతికాముకత, ప్రజాక్షేమం అనే పేరుతో లజ్జాకరమైన యీ రాజీకి మీ రంగీకరించినందువల్ల ఈ దేశ స్వాతంత్ర్యం యెంతమాత్రం పరిరక్షింపబడదు. నా కాళ్ళూచేతులూ విరచికట్టి అక్బరు పాదాలముందు పడవెయ్యాడం ఓ ఘనతకాదు! ఇందువల్ల శత్రువులబారినుండి యీ రాజ్యం రక్షింపబడుతుందనుకోడం శుద్ధ తెలివితక్కువతనం. కన్నకూతుర్ని శత్రువుకు సమర్పించే లజ్జావిహీనుడైన పరిపాలకుడు తనను కన్న మాతృదేశాన్నికూడా శత్రు పాదాక్రాంతం చెయ్యడానికి సిగ్గుపడడు!" అని యెంతో ఆవేశంతో అన్నది జియారాణి.

బిహారిమల్ సిగ్గుతో తల బాదుకోవలసిన పరిస్థితి యేర్పడింది. అసమర్థుడికి తేలికగా వచ్చేది కోపం మాత్రమే! బిహారిమల్‌కి అదే వచ్చింది. అతని నేత్రాలు అరుణారుణ మయినాయి. క్రోధోన్మత్తుడయి "తండ్రినే ధిక్కరించే నీవంటి నీచురాలిని ఏంచేసినా పాపంలేదు!" అంటూ కత్తిపిడి మీదికి చేయి పోనిచ్చేడు.

ఆ క్రోధోన్మత్తతతో కుమార్తెను వధించి తన కోపాగ్నిని చల్లార్చుకొనే స్వాతంత్ర్యంకూడా లేని అసమర్థుడాతడు. మహాబలవంతుడయిన అక్బరు వాంఛించిన వధూటి తన పుత్రిక. అట్టి తన కుమార్తెను శత్రువైన అక్బరుకు సగౌరవంగా సమర్పించడంవినా యింకేరకమైన స్వాతంత్ర్యం తన కుమార్తెపై తనకిక లేదు. తన దౌర్భాగ్యస్థితిని తల్చుకొనేసరికి అతని నేత్రాలు ఆర్ద్రిమయేయి. అప్రయత్నంగానే కత్తిపిడిమీద నుంచి అతని చేయి తొలగిపోయింది.

"సందేహిస్తున్నారేం ?... మీ యిష్టాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కసితీరా నన్ను వధించండి నాన్నా!" అని కొంచెం సేపు మౌనంగాఊరుకొని పేలవంగా నవ్వుతూ "మీకిప్పుడున్న స్వాతంత్ర్యం ఏపాటిదో తేలిపోయింది. అంబర్ ప్రభువులైన మీరు — మిమ్మల్ని ధిక్కరించిన కన్న కుమార్తెను వధించేటందుకైనా స్వేచ్ఛలేదు!... నేను మీ కత్తికి ఆహుతయేటందుకు సంసిద్ధురాలనై తలముందుకు వంచినా నన్ను వధించే అధికారం మీకీనాడు లేదు. నన్ను సజీవంగా ఘనంగా తగిన

గౌరవ మర్యాదలతో అక్బరుకు కన్యాదానం చెయ్యకపోతే మీకూ మీ రాజ్యానికి యిక మనుగడే వుండదనికదూ మీ భయం? ఈనాడు మనకున్న స్వాతంత్ర్యం యిది!... అక్బరు మనపట్ల ప్రదర్శిస్తున్న ఉదారత ఈ తీరులోవుంది! ఇటువంటి కుటిలమైన ఉదారతను ప్రదర్శిస్తున్న అక్బరుని వివాహమాడితే అతడి అంతఃపురంలో నా మత స్వేచ్ఛకు అడ్డుతగలడని ఎలా అనుకోడం?... మన స్వవిషయాలలో మన కతడీయని స్వేచ్ఛను తన అంతఃపురంలో యిస్తాడని అంటే ఎలా విశ్వసించడం? అక్బరుచే రూపొందించబడిన కుటిల రాజకీయ లోక్యంలో యిదొక భాగం!... నాన్నా! చివరి మాట చెపుతున్నా! మీరు నా మాన మర్యాదలను కాపాడలేక నన్ను అక్బరుకు పాదాక్రాంతం చేసిన మరు క్షణములోనే ... ...” జియారాణి యింకా వాక్యం పూర్తి చేయకముందే,

“నీవుండవంటావు? ఆత్మహత్య చేసుకుంటానంటావు. అంతేకదూ?” అనడిగేడు బిహారీమల్.

“నే నంటున్నదది కాదు నాన్నా! ... మీరు నన్ను అక్బరుకి పాదాక్రాంతం చేసిన మరుక్షణంలోనే మీరు, మీ అధికారము ఏదీ వుండదంటున్నాను. మీకు, మీ స్వేచ్ఛకు, మీ అధికారానికి రక్షణ – నన్ను మీరు రక్షించుకోగలిగి నప్పుడు మాత్రమే వుంటుంది!” అని జియారాణి అనేసరికి ఏం చెయ్యడానికీ తోచని అయోమయ పరిస్థితిలో పడ్డాడు బిహారీమల్.

"నీ కిష్టమున్నా లేకపోయినా ఈ వివాహం తప్పక జరిగి తీరుతుంది !" అని తండ్రి అనేసరికి అతడి ముఖంలోకి విషాదంగా చూస్తూ నీరసంగా నవ్వింది జయారాణి. ఆ నవ్వులో ఎంతటి విషాదం దాగివున్నదీ గ్రహించగలిగిన బిహారిమల్ మరి అక్కడ వుండలేక వెళ్ళిపోయేడు.

♦ ♦ ♦

ఆ రాత్రి బిహారిమల్‌కు కంటిలోద కునుకులేదు. తన కుమార్తెయొక్క దేశభక్తి, స్వధర్మ రక్షణాభిలాష అతని హృదయాన్ని ఉప్పొంగజేసినాయి. ఉత్తేజితుడైనాడు !

అక్బరిని ఎదిరిస్తేనో ?...

ఆలోచించగా పిరికితనం ఆవహించింది !

అక్బరిని తాను యెదిరించడమా ? ... అసంభవ మను కున్నాడు.

భారత దేశానికివి చెడ్డ రోజులా ? కాకపోతే ఏమిటీ వైపరీత్యం ? ఒక విదేశీయ యువకుడు తన కిటువంటి అవమాన కరమైన పరిస్థితి నిలా తెచ్చిపెట్టడం సంభవించింది ?... కొన్ని కోట్ల మంది హిందువులుగల ఈ హిందూదేశంలో హిందువుల పైనా, వారి ధర్మాలపైనా దాడిచేసి జయించగలిగే శక్తి విదేశాలనుండి వచ్చిన కొద్దిపాటి ముస్లిముల కెలావచ్చింది ! ఇదంతా విధి వైపరీత్యం కాకపోతే తన కుమార్తె వివాహ

విషయంలో తనకేమీ స్వేచ్ఛ లేకపోవడమేమిటి ?... స్వీయ వివాహ విషయంలో తన కుమార్తెకు ఏమీ స్వేచ్ఛలేని పరిస్థితి ఎందుకు దాపురించింది ?... మాన మర్యాదలను కోల్పోయి స్వధర్మాన్ని విస్మరించి నీచంగా బ్రతికేకంటే రణరంగంలో కంఠములో ప్రాణమున్నంతవరకూ పోరాడి మరణించడమే యుక్తమనుకొని ఉద్రిక్తుడయేవాడొక్కొక్క క్షణంలో.

కాని మరు క్షణంలోనే హతాసుడేయి దిగజారిపోయే వాడు !...

తన నిర్ణయాన్ని తన కన్నకూతురు ధిక్కరించడమా ? తనతోనే వాదప్రతివాదాలు చెయ్యడమా ? ఎంత సాహసం ? ఇంతకీ అక్బరును వివాహమాడితే ఆమెకు వచ్చే నష్టమేమిటి? అతనితో బాంధవ్యం రాజ్యానికెంతో భద్రతనిస్తుంది ! అతడి నెదిరించినవారంతా సర్వనాశనమవుతున్నారు. ఏదో విధంగా రాజీ చేసుకున్న వారు హాయిగా సుఖిస్తున్నారు. ఈ మూర్ఖురాలి మాటవింటే సర్వనాశన మవడంతప్ప యింకేమయినా ప్రయోజనముంటుందా ?... ఇలా కొంతసేపు ఆలోచించేవాడు.

ఇంతకీ కర్తవ్యమేంటి? అతని ఆలోచనలకు అంతులేదు ! ఆ ఆలోచనతోనే తెల్లారిపోయింది !

ఆ రాత్రి జియాకు నిద్ర పట్టిందో లేదో ? ... ఆమె తన మనస్సు మార్చుకున్నదో లేదో ? ... ఆమె మనస్సు మార్చు కోకపోతే తనేంచెయ్యడం ?... ఆలోచిస్తూత్వరత్వరగా జియా వున్న మందిరానికి వెళ్ళేడు బిహారీమల్. జియా శయ్యమీద

వున్నది. "తెల్లారింది లే జియా!" అంటూ ఆమె వీపుపై తట్టేడు.

ఉలుకూ పలుకూ లేదు!

ఇటూ అటూ కదలించి తనవైపు త్రిప్పేడు. ఎటు వేసిన చెయ్యి అటే వ్రేలాడిపోతోంది. కొయ్యబారిపోయిన శరీర మది. అందులో జీవంలేదు! అది జియా శవం!... "జియా!" అని ఒక గావుకేక పెట్టి కుప్పలా కూలిపోయేడు బిహారీమల్. ఆ కేక విని జియా చెలికత్తె మదనిక గాభరాగా పరుగెత్తు కొచ్చిందక్కడికి. జియా కళేబరాన్నిచూసి నిర్ఘాంతపోయింది. కొద్ది క్షణాలసేపు నిర్జీవ ప్రతిమలా స్తంభించిపోయింది! ఎలాగో తేరుకొని ప్రక్కనే బల్లపైవున్న లిఖిత పత్రం వేపు చూసి దానిని తీసి బిహారీమల్ కు అందించింది. అది అంతఃపుర రహస్యం గనుక తలుపులు వెయ్యమన్నాడు మదనికను. ఆ తరువాత పొంగివస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ పత్రం తెరచి ఆతృతతో చదవసాగేడు.

"పూజ్యులైన తండ్రిగారికి,

జియా అంతిమ నమస్కారములు. మీ అభీష్టాన్ని నెరవేర్చలేకపోతున్నందుకు నన్ను మన్నించండి. నేనీ వివాహాని కంగీకరించడమంటే అక్బరుయొక్క క్రౌర్యాన్ని, రాజ్య విస్తరణకాంక్షను, కామతృష్ణను ప్రోత్సహించడమే అవుతుంది. స్వధర్మ వినాశనానికి నేను తోడ్పడలేను. నాకు మీరెంతో ప్రేమతో యిచ్చిన వజ్రాలహారమే నేను నా మాన మర్యాద

లను కాపాడేటందు కీతీరులో ఉపయోగపడింది. భగవంతుడు నా ప్రార్థనను మన్నించి హైందవ ధర్మాన్ని రక్షించేటందు కవసరమైన శక్తి సామర్థ్యాలుగల ఒక గొప్ప క్షత్రియ వీరునిగా నాకతి త్వరలోనే మరొక జన్మనిస్తాడని ఆశిస్తున్నాను.

మీ
జియా రాణి.

ఈ లేఖ చదవడం పూర్తయిన వెంటనే బిహారిమల్ కొద్ది నిముషాలసేపు చైతన్యాన్ని కోల్పేయేడు.

మళ్ళీ కోలుకున్నాక యిక కర్తవ్యమేమిటా అని ఆలోచించసాగేడు. అక్బరికి తనిక ఏంవని సమాధానం చెప్పుకోడం? తన సమాధానం అక్బరిని శాంతింపజేస్తుందా? ... మతాంతర వివాహం చెయ్యడం యిష్టంలేక కూతురికి తనే విషమిచ్చి చంపేసి – తన కూతురు ఆత్మ హత్య చేసుకున్నదని తను బొంకుతున్నట్లు అక్బరు అపోహపడి, తనను, తన రాజ్యాన్ని సమూలంగా నాశనం చేస్తాడేమోననే భయం పట్టుకుందతనికి. జియాను కన్యాదానం చెయ్యని నేరానికిగాను యిక తప్పక అక్బర్ యొక్క క్రోధాగ్నికి తను, తన శ్రేయోభిలాషులూ గురికావల్సొంటుందనుకున్నాడు. స్వధర్మ రక్షణకై రణ రంగములో కంఠంలో ప్రాణమున్నంతవరకూ పోరాడి అసువులను బాసినా బాగుండిపోయేది!... అలా చేసినట్లయితే తన బిడ్డ మెచ్చేది – దేశమాత మెచ్చేది – చరిత్ర మెచ్చేది – జాతి

మెచ్చేది. ఛీ ఛీ! ... ఎందుకూ పనికిరాని వట్టి నిరర్థకమైన జీవితమయిపోయింది తనది. తన నిర్వీర్యతకు, స్వధర్మ భ్రష్టతకు భవిష్యత్ భారతజాతి ఎంతగానో అసహ్యించుకుంటుందనుకున్నాడు బిహారీమల్.

ఇక కర్తవ్య మేమిటా అని ఆలోచిస్తూ మదనికవేపు చూసేడు. ఆమెలో తన కుమార్తె పోలికలు కనిపించేసరికి తళుక్కున మెరపు మెరసినట్లొక ఆలోచన అతని మస్తిష్కములో మెరసింది!... బహిరంగంగా చెప్పుకోడానికి అవకాశం లేకపోయినా ఒక రకంగా మదనికకూడా తన కుమార్తే! ... మదనిక తల్లి తన పట్టపురాణీకి చెలికత్తెగా ఉండేది. యౌవనోద్రేకంలో తానొకనాడామెను పరిగ్రహించిన ఫలితమే మదనిక! ... అందువల్లే మదనికలో తన పోలికలు!... జియారాణిలో తన పోలికలు!... మదనికలో జియారాణి పోలికలు! ఆ సమయంలో ఆ గదిలో మదనిక తప్ప తదితరులెవ్వరూ లేరు!

ఈ అంతఃపుర రహస్యాన్ని జీవితాంతంవరకూ కాపాడి, తన జియారాణీగా రూపొంది — కన్యాదాన ఫలం తనకు దక్కించమని మదనికను దీనంగా అర్థించేడు బిహారీమల్.

కాదనలేకపోయింది మదనిక.

జియారాణి దుస్తుల్ని, అలంకారాలను ధరించి ముమ్మూర్తులా జియారాణిలాగే రూపొందింది మదనిక!

మదనిక చనిపోయినట్లు వెల్లడించి మిగిలిన కర్మకాండను అతి గుట్టుగా జరిపించేసారు.

నిశ్చయించిన ముహూర్తానికి అక్బర్‌నకు కన్యాదానం చేశాడు బిహారిమల్. ఏదో పెద్ద బరువును దింపినవాడిలా సుదీర్ఘంగా నిట్టూర్చేడు. ఇక బ్రతికిపోయాననుకున్నాడు.

అతడు ఏ రకంగా బ్రతికిపోయినదీ, అక్బరతని బంధుమిత్రాదులందరినీ బంధవిముక్తులను చేసినదీ లేనిదీ సరిగ్గా తెలియదు! కాని ఘనతవహించిన అక్బర్ యొక్క మతసహన బండారం మాత్రం బయటపడింది!... బిహారిమల్ దానంచేసిన కన్యకు "మార్యమ్-ఇ-జమాని" అని తను మత సాంప్రదాయానుగుణంగా పేరు మార్చేరు. ఆమెకు పుట్టిన బిడ్డ పేరు సలీమ్!... ఈ విధంగా కన్యాదానఫలం పొందేడు బిహారిమల్.

— సంపూర్ణం —

ఈ రచనకై పరిశీలింపబడిన గ్రంథములు :—

1) "Some Blunders of India Historical Research" by Sri P. N. Oak.
2) "Akbar" by J. M. Shalat.
3) "Akbar, the Great Moghul" by Vincent Smith.
4) "Akbarnama" by Abulfazl.